


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 17-06-2026 | సంపుటి - 29 | సంచిక -23 | రూ : 4 | పేజీలు: 8


## ఓటర్లకు సవాలే!

- 2.36 కోట్ల మంది మ్యాపింగ్... అందులో 89 లక్షల మంది వివరాల్లో లోపాల గుర్తింపు
- తగిన ఆధారాలు చూపకపోతే ఓటు గల్లంతే

హైదరాబాద్: ఓటర్లకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పెద్ద సవాల్‌గా మారనుంది. 2002లో నిర్వహించిన ఎస్ఐఆర్ జాబితాతో 2025 ఓటర్ల జాబితాలోని పేర్లు 30 శాతం వరకు మ్యాపింగ్ జరగలేదు. మ్యాపింగ్ జరిగిన పలువురు ఓటర్ల వివరాల్లోనూ లోపాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు గుర్తించారు. వీరందరిపైనా ఈ నెల 25 నుంచి జరిగే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రభావం చూపనుంది. 2025 జాబితాలో 3,38,29,018 మంది తరువాయి 2లో





## 'అన్నదాతలకు' సంపూర్ణ భరోసా

- వానాకాలం సీజన్‌కు 26 నుంచి రైతుభరోసా నిధుల జమ
- విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా సమగ్ర ప్రణాళిక
- కార్యాచరణకు ప్రత్యేక కమిటీ
- రైతు వేదికల్లో ఎరువుల పంపిణీ
- సబ్సిడీపై 7 రకాల సన్న వడ్ల విత్తనాలు
- ఎరువుల కోటా కోసం ఎంపీలతో కలిసి ఢిల్లీకి మంత్రుల బృందం
- వ్యవసాయశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

## ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

### పాక్‌తో లింకులున్న ఏడుగురి అరెస్ట్



- ఢిల్లీలో పాక్ ప్రేరేపిత ఉగ్రముఠా గుట్టురట్టు
- ఏడుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన స్పెషల్ సెల్ పోలీసులు
- పాక్ నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, డ్రగ్స్ సరఫరా
- మత ఉద్రిక్తతలు సృష్టించేందుకు ఉగ్రవాదుల కుట్ర

2లో

## మద్యం ప్యాకెట్లపై నిషేధం సుప్రీంకోర్టు కీలక సూచన

- మద్యం ప్యాకింగ్‌లపై సుప్రీంకోర్టు సీరియస్
- టెట్రా ప్యాక్‌ల నిషేధానికి పిటిషన్
- కేంద్రానికి, రాష్ట్రాలకు నోటీసులు జారీ
- తాగి నడపడం వల్లే ప్రమాదాలు
- యువతను ఆకర్షిస్తున్న కొత్త బ్రాండ్లు

2లో





## బోనస్‌ను పూర్తిగా ఎత్తేసే కుట్ర

2లో

- వ్యవసాయ శాఖపై సీఎం మొక్కుబడి సమీక్ష : హరీశ్‌రావు

### ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..

## కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి

2లో






### ఢిల్లీలో భారీగా

## పెరిగిన జనాభా!



- సెన్సస్ 2027 తొలి దశలో 2.3 కోట్లు దాటిన ఢిల్లీ జనాభా
- 2011తో పోలిస్తే 15 ఏళ్లలో 37.5 శాతం వృద్ధి నమోదు
- ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల మంది జనాభా
- ఇవి ప్రాథమిక గణాంకాలేనని, తుది నివేదిక 2027లో వస్తుందని వెల్లడి

2లో

# 'అన్నదాతలకు' సంపూర్ణ భరోసా

హైదరాబాద్ : వానాకాలం సీజన్‌లో విత్తనాల సరఫరా నుంచి పంట కొనుగోళ్ల వరకు అన్నదాతలకు సంపూర్ణ భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిర్దిష్ట కార్యాచరణకు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం ఎంసీహెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఆయన వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, రైతు సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కమిషన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ నిపుణుల సూచనలపై సమీక్షించారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా పథకం నిధుల విడుదలకు సన్నాహాలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ, ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల కోసం రూ.9 వేల కోట్లను విడుదల చేయాలని వ్యవసాయశాఖ ప్రతిపాదించగా... దానికి ఆయన ఆమోదం తెలిపారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖకు సూచించారు. వ్యవసాయ, ఆర్థికశాఖలు ఈ నెల 18న జరిగే మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించనున్నాయి. ఈ నెల 26న తొలిరోజున రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులకు ఎకరం వరకు సాయం అందేలా నిధులను విడుదల చేస్తారు. మిగిలిన రైతులకు విడతల వారీగా నిధులు జమ చేస్తారు.

**ప్రత్యేక కమిటీ వేయాలి..**

"ఏ రైతు ఏ పంట వేశారు.. ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి.. ఇలా అన్ని వివరాలు కచ్చితంగా క్షేత్రస్థాయి పరిశీలనతో నమోదు చేయాలి. కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో ఆయా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోండి. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలను గమనంలోకి తీసుకొని తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయడం చాలా కీలకం. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆ శాఖ సంచాలకుడు, ప్రణాళిక శాఖ కార్యదర్శి, పౌరసరఫరాల సంచాలకునితో ప్రత్యేక కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి.

**వ్యవసాయ వర్సిటీ ద్వారా సాంకేతికత**

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలి. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలి. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను అధ్యయనం చేయాలి.

**వేదికలు అన్నింటికీ ఉపయోగపడాలి**

రైతు వేదికలను ఇకపై అన్నింటికీ ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడే రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ జరగాలి. ప్రతి వేదిక వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలి.



జిల్లాల్లో వాటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలి. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో వాటిని పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించండి. వ్యవసాయశాఖ నిర్దేశించిన ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సమృద్ధిగా నిల్వ చేసి రైతులకు సబ్సిడీపై ఇవ్వాలి.

# ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..
## కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం. ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

# ఓటర్లకు సవాలే..!

హైదరాబాద్: ఓటర్లకు ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పెద్ద సవాల్‌గా మారనుంది. 2002లో నిర్వహించిన ఎస్ఐఆర్ జాబితాతో 2025 ఓటర్ల జాబితాలోని పేర్లు 30 శాతం వరకు మ్యాపింగ్ జరగలేదు. మ్యాపింగ్ జరిగిన పలువురు ఓటర్ల వివరాల్లోనూ లోపాలు ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు గుర్తించారు. వీరందరిపైనా ఈ నెల 25 నుంచి జరిగే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రభావం చూపనుంది. 2025 జాబితాలో 3,38,29,018 మంది ఓటర్లు ఉండగా 2,36,54,232 మంది మ్యాపింగ్ మాత్రమే జరిగింది. వీరిలోనూ 89,44,713 మంది వివరాల్లో వివిధ తేడాలను అధికారులు గుర్తించారు. ఈ ఓటర్లు తగిన గుర్తింపు పత్రాలు సమర్పించకపోతే జాబితా నుంచి పేర్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లలో మరో 1,01,74,786 మందిని అన్‌మ్యాపింగ్ జాబితాలో చేర్చారు.

* ఈ ఓటర్లలోనూ చాలా మంది ఎన్యూమరేషన్ పత్రాలను నింపితే నోటీసులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాంటి వారూ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఓటర్లలో అన్‌మ్యాపింగ్‌తో పాటు మ్యాపింగ్‌లో లోపాలు గుర్తించిన ఓటర్లు మొత్తం 1,91,19,499 మంది ఉన్నారు. కొన్ని చోట్ల మ్యాపింగ్ ప్రక్రియ సరిగా జరగకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. దీని ప్రభావం ఓటర్లపై పడే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.

* **చాలా నియోజకవర్గాల్లో ఓటర్లపై ప్రభావం..**
* నారాయణపేట జిల్లాలోని మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలో మొత్తం 4,95,581 మంది ఓటర్లు ఉండగా 4,23,118 మంది ఓటర్ల(85.38 శాతం)ను మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్ జరిగిన ఓటర్లలోనూ 1,87,149 మంది వివరాల్లో వివిధ లోపాలను గుర్తించారు. అన్‌మ్యాపింగ్‌లో మరో 72,463 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో వలస కార్మికులు, పేదలు అధికంగా ఉంటారు. రాబోయే ఎస్ఐఆర్‌లో వీరిపై ప్రభావం అధికంగా ఉంటుందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.
* ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నిర్మల్‌లో 2,64,309 మంది ఓటర్లు ఉండగా 2,12,270 మందిని మ్యాపింగ్ చేశారు. వీరిలో 95,439 మంది ఓటర్ల వివరాల్లో తేడాలను గుర్తించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,50,455 మంది ఓటర్లకుగాను 1,61,056 మంది మ్యాపింగ్ చేయగా.. వీరిలో 71 వేల మంది వివరాల్లో లోపాలను గుర్తించారు.
* నిజామాబాద్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 14,39,900 మంది ఓటర్లు ఉన్నారు. బీఎల్‌వోలు 12,53,284 మంది మ్యాపింగ్ చేశారు. వీరిలో 5,07,143 మంది వివరాల్లో లోపాలను గుర్తించారు.
* రాష్ట్రంలో అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఓటర్ల వివరాల్లో భారీ తేడాలు ఉన్నాయి. మొత్తం ఐదు నియోజకవర్గాల్లో 29,78,532 మంది ఓటర్లు ఉండగా.. 12,89,802 మంది మ్యాపింగ్ చేపట్టారు. ఇందులోనూ వివరాల్లో లోపాలున్న 8,38,150 మంది ఎన్నికల సంఘం ప్రకటించిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది.
* మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కూడా మ్యాపింగ్ జరిగిన ఓటర్ల వివరాల్లో పలు తేడాలు ఉన్నాయి.

# ఢిల్లీలో భారీగా పెరిగిన జనాభా!

దేశ రాజధాని ఢిల్లీ జనాభా అనూహ్యంగా పెరిగింది. జనగణన 2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ సర్వేలో ఢిల్లీ జనాభా 2.3 కోట్లు దాటినట్టు ప్రాథమికంగా తేలింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1.7 కోట్లుగా ఉన్న జనాభా, గత 15 ఏళ్లలో సుమారు 37.5 శాతం పెరగడం గమనార్హం. సెన్సస్ 2027లో భాగంగా చేపట్టిన 'హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' తొలి దశ ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమై జూన్ 14న ముగిసింది. ఈ సందర్భంగా అధికారులు ఢిల్లీలోని 45,863 బ్లాకులలో పర్యటించి దాదాపు 76 లక్షల ఇళ్లు, 55 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశారు. ఈ వివరాల ఆధారంగా జనాభాను ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే, ఈ గణాంకాలు తాత్కాలికమైనవేనని అధికారులు స్పష్టం చేశారు. 2027 ఫిబ్రవరిలో చేపట్టనున్న రెండో దశ 'జనాభా లెక్కింపు' తర్వాతే తుది జనాభా సంఖ్యను ఖరారు చేస్తారు. రెండో దశలో ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. జిల్లా వారీగా చూస్తే, ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 28 లక్షల జనాభా ఉండగా, నైరుతి ఢిల్లీలో 25 లక్షల మంది నివసిస్తున్నారు. అత్యల్పంగా న్యూఢిల్లీ జిల్లాలో కేవలం 2 లక్షల జనాభా నమోదైంది. 2026 మధ్య నాటికి ఢిల్లీ జనాభా సుమారు 2.3 కోట్లకు చేరుకుంటుందని గతంలో వచ్చిన అంచనాలకు, తాజా గణాంకాలు దగ్గరగా ఉండటం విశేషం.

# మద్యం ప్యాకెట్లపై నిషేధం.. సుప్రీంకోర్టు కీలక సూచన

భారతదేశంలో తాగి వాహనాలు నడపడం వల్ల ఏటా వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సులభంగా దాచుకోవడానికి వీలుగా ఉండే టెట్రా ప్యాక్‌లు , సాషేల రూపంలో విక్రయించే మద్యం వల్ల రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరుగుతున్నాయని దాఖలైన పిల్పై కోర్టు మంగళవారం (జూన్ 16) కీలక విచారణ చేపట్టింది. ఈ ప్యాకింగ్‌లను పూర్తిగా నిషేధించాలన్న పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖతో పాటు 38 రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది. 'కమ్యూనిటీ అగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్'(CADD) సంస్థ ప్రతినిధి ప్రిన్స్ సింఘాల్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెట్రా ప్యాక్‌లలో వచ్చే 'గ్రీన్ ఆపిల్ వోడ్కా' వంటి ఆల్కహాల్ ఉత్పత్తులు చూసేందుకు సాధారణ పండ్ల రసాల ప్యాకెట్లలా ఉంటూ ప్రజలను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇవి చిన్నగా ఉండటం వల్ల కదులుతున్న వాహనాల్లో కూడా ఎవరికీ అనుమానం రాకుండా దొంగచాటుగా మద్యం సేవించడానికి, తద్వారా ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**ఏటా లక్షన్నర మంది బలి**

భారతదేశంలో ప్రతి సంవత్సరం 6 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, దాదాపు 1.5 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందులో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న యువతే ఎక్కువగా ఉంటున్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో ఈ చిన్న టెట్రా ప్యాక్‌ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయని, ఇవి మైనర్లకు సులభంగా దొరుకుతున్నాయని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ.. ప్రజల ఆరోగ్యం, భద్రతపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండటం లేదని పిల్‌లో పేర్కొన్నారు. అతివేగం తర్వాత దేశంలో అత్యధిక మరణాలకు కారణం తాగి నడపడమేనని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ నకిలీ లేదా భ్రమ కలిగించే ప్యాకింగ్‌ల స్థానంలో కేవలం సులభంగా గుర్తించదగిన సీసాలు మాత్రమే వాడేలా జాతీయ విధానాన్ని తీసుకురావాలని, పెద్ద హెల్త్ వార్నింగ్‌లను ముద్రించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సింగపూర్‌లో చంద్రబాబు పుస్తకావిష్కరణ

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాలనా దక్షత, దార్శనికతపై రాసిన 'సీబీఎన్@361 డిగ్రీస్.. పాలీమ్యాథ్' అనే పుస్తకాన్ని సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, రాష్ట్ర మంత్రి పి. నారాయణ, అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వివిధ సందర్భాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను లోతుగా విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. 'రేపటికోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ ఈ పుస్తకాన్ని రచించగా, విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలోకి అనువదించారు. ఈ సందర్భంగా రచయిత శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. సింగపూర్ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ, న్యూజిల్యాండ్ మాజీ ప్రధాని జెసిండా ఆర్డర్న్ వంటి ప్రపంచ స్థాయి నేతల మాదిరిగానే చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటారని విశ్లేషించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన రూపొందించిన విజన్‌లు, అమరావతి రాజధాని నిర్మాణం పట్ల చూపిస్తున్న శ్రద్ధ దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పుస్తకంలో ఏపీ రెరా మాజీ ఛైర్మన్ రామనాథ్ పలు సందర్భాల్లో వెల్లడించిన అభిప్రాయాల్లోని కీలక అంశాలను కూడా పొందుపరిచినట్టు రచయిత తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రత్యేక వెండి నాణేన్ని అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి బహూకరించారు.

## ఢిల్లీలో..
# భారీ ఉగ్రకుట్ర భగ్నం

దేశ రాజధాని ఢిల్లీలో భారీ ఉగ్రకుట్ర భగ్నమైంది. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న ఒక ఉగ్రవాదనేరపూరిత ముఠా గుట్టును ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ రట్టు చేసింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఏడుగురు సభ్యులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. పాకిస్థాన్‌లో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్‌టెర్రరిస్ట్ షహజాద్ భట్టి ఆదేశానుసారం ఈ ముఠా పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పంజాబ్ సరిహద్దుల మీదుగా పాకిస్థాన్ నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను ఈ ముఠా ఢిల్లీఎన్‌సీఆర్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. రాజధానిలోని రద్దీ ప్రదేశాలు, కీలక సంస్థలు, మత పెద్దల నివాసాల వద్ద వీరు రెక్కీ నిర్వహించి, వాటికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్లకు పంపినట్లు విచారణలో తేలింది. ఢిల్లీలో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు పన్నిన ఓ భారీ కుట్రను ఈ అరెస్టులతో అడ్డుకున్నామని అధికారులు తెలిపారు.

# డిజిటల్ మోసాలు రెట్టింపు

* **ప్రపంచ సగటుతో పోల్చితే భారత్ లో ఆందోళకరం: ట్రాన్స్ యూనియన్ వెల్లడి**

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏటా రికార్డు స్థాయిలో విస్తరిస్తున్నప్పటికీ అదే వేగంతో సైబర్ నేరగాళ్లు కూడా విరుచుకుపడుతున్నారు. అంతర్జాతీయ క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో డిజిటల్ మోసాల ముప్పు దాదాపు రెట్టింపు స్థాయిలో పొంచి ఉంది. గడిచిన ఏడాదిలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన డిజిటల్ లావాదేవీలలో అనుమానాస్పద మోసాల సగటు 3.8 శాతంగా నమోదైతే.. భారత్‌లో ఈ రేటు ఏకంగా 7.1 శాతానికి చేరి ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగవంతమైన వృద్ధిని కనబరుస్తున్న లాజిస్టిక్స్, టెలికాం, మరియు ఇన్సూరెన్స్ రంగాలు ఈ సైబర్ మోసగాళ్ల ప్రధాన లక్ష్యంగా మారుతున్నాయి. పరిశ్రమల వారీగా ఈ డేటాను పరిశీలిస్తే.. కొరియర్, రవాణా సేవలు అందించే లాజిస్టిక్స్ రంగం 16.3 శాతం అనుమానాస్పద మోసాల రేటుతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో టెలికాం రంగం 14.7 శాతంతో, బీమా రంగం 11.5 శాతంతో తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ నిర్దిష్ట రంగాలు వెంటవెంటనే జరిగే లావాదేవీలపై, విస్తృతమైన డిస్ట్రిబ్యూటెడ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడి పనిచేస్తుండటమే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. వినియోగదారుల గుర్తింపును సరిచూసే ప్రక్రియల్లో, అథెంటికేషన్ వ్యవస్థల్లో ఉన్న సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు ఈ రంగాల ఖాతాల్లోకి సులభంగా చొరబడుతున్నారు. అయితే అంతర్జాతీయ ట్రెండ్‌తో పోలిస్తే భారత్‌లో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న వ్యూహం పూర్తి భిన్నంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్త అకౌంట్లు తెరిచేటప్పుడు మోసాలు ఎక్కువగా జరుగుతుంటే.. భారత్‌లో మాత్రం ఇప్పటికే చలామణిలో ఉన్న వినియోగదారుల ఖాతాల్లోకి లాగిన్ అయ్యే సమయంలోనే గరిష్టంగా 3.9 శాతం మోసాలు జరుగుతున్నాయి. వ్యాపార సంస్థలు, వినియోగదారులు లాగిన్ దశల్లో తమ భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బోనస్‌ను పూర్తిగా ఎత్తేసే కుట్ర

హైదరాబాద్ : వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్కుబడి సమీక్ష నిర్వహించారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. పంట బోనస్‌కు కోతలు, రైతన్నకు వాతలు పెట్టేందుకే సమీక్ష నిర్వహించినట్టా?అని ప్రశ్నించారు. పంట బోనస్ నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు సన్న రకాల సంఖ్యను తగ్గించడం సిగ్గుచేటని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏ రకం ధాన్యం వేయాలని సర్కారు నిర్ణయించడం అంటే రైతన్న మెడపై ప్రభుత్వం కత్తి పెట్టడమేనని తెలిపారు. మ్యానిఫెస్టోలో అన్ని రకాల పంటలకూ రూ. 500 బోనస్ అని, తర్వాత 33 రకాల సన్నాలకు పరిమితం చేశారనీ, ఇప్పుడు దాన్ని ఏడు రకాలకు తగ్గించారని గుర్తు చేశారు. ఇప్పటికే నారు వేసిన రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇంత నిర్బంధంగా, కఠినంగా రైతులతో వ్యవహరించాల్సిన అవసరం ఏముందని అడిగారు. రైతులంటే ఈ ప్రభుత్వానికీ ఎందుకంత కోపమని పేర్కొన్నారు. రైతు బంధు, పంట బోనస్, పంటల బీమా, రైతు బీమా గురించి సమీక్ష చేయకపోవడం అంటే రైతు సంక్షేమాన్ని విస్మరించడమే అవుతుందని తెలిపారు. ఎన్నికలు లేకుంటే రైతు భరోసా ఇవ్వరా?అని ప్రశ్నించారు. ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీ నగర్ కాబ్సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో మంగళవారం పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ నాయకులు స్వర్గీయ జల్దా రాఘవులు జ్ఞాపకార్థం పదవ తరగతి లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ముందుగా స్వర్గీయ జల్దా రాఘవులు స్మృతికి విద్యార్థులు, అధ్యాపకులు 2 నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరి మాట్లాడుతూ స్వర్గీయ రాఘవులు ప్రాథమిక పాఠశాల లో కేవలం 2 గదులతో ఉన్న పరిస్థితి నుండి ఈ రోజు విశాలమయిన గదులతో చక్కని వాతావరణం లో పాఠశాల నిర్మాణం కోసం శ్రమించారాని గుర్తు చేసారు. అనంతరం ఇటీవలి పదవ తరగతి పరీక్షలలో గాంధీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హఫషా జరీన్ 572 మార్కులతో మండలం లోనే ప్రథమ శ్రేణి లో పాస్ అయిన సందర్భంగా, మరో విద్యార్థి శృతి లకు స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ తరపున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమం లో యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మి నాథ్, అధ్యాపకులు రఘునందన్, పాఠశాల కమిటీ ప్రతినిధులు పద్మ, మణి, యువజన సంఘం నాయకులు తిమ్మయ్య, నవీన్, శ్రీను, విజయ్, రాంచందర్, శ్రీధర్,ఆనంద్,సాయి, రవితేజ, నాగరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ మంగమ్మ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

* **మాజీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణా నాయక్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలో ఉన్న పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ మంగమ్మ మృతి గ్రామానికి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ అన్నారు మాజీ సింగిల్ విండో చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి తో కలిసి వారి ప్రార్ధన దేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు నర్సింగ్ మంగమ్మ గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న నందున బ్లడ్ క్యాన్సర్ తో మృతి చెందడం జరిగిందని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వారి కుమారులు నర్సింగ్ రామకృష్ణ నర్సింగ్ బాలకృష్ణ నర్సింగ్ విజయ్ గార కుంట తండా గ్రామ సామాజిక సేవాకర్త నరేందర్ నాయక్ , గ్రామ బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొహరం పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో జరగనున్న మొహరం (పీర్ల పండుగ) వేడుకలకు సంబంధించి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలోని పీరీల కొట్టం వద్ద ఉన్న స్థలంలో ముళ్ల పొదలు, పిచ్చి చెట్లు విస్తారంగా పెరిగి ఉండటంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల విషపురుగులు సంచరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ మొహరం పండుగ ఉత్సవాలను భక్తులు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకునేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పీరీల కొట్టం పరిసరాలను శుభ్రపరచడంతో పాటు విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పించడం,పరిశుభ్రత పనులు చేపట్టడం వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని అవసరమైన సౌకర్యాలు కల్పించి సహకరించాలని కోరారు.

## శ్రీ హనుమాన్ దేవాలయానికి ధూపదీప నైవేద్య జీతం మంజూరు చేయాలి

* **మంత్రి కొండా సురేఖకు వినతి**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : చిన్న ఉమ్మెంతల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి (హనుమాన్) దేవాలయానికి ధూపదీప నైవేద్యాల నిర్వహణ కోసం జీతం మంజూరు చేయాలని గ్రామస్తులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు.ఈ సందర్భంగా గ్రామ నాయకుడు ఉమ్మెంతల కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేవాలయానికి ధూపదీప నైవేద్యాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా జీతం లేకపోవడంతో పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన దేవాదాయ శాఖ మంత్రికి సిఫార్సు లేఖ అందజేసినట్లు చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే సిఫార్సు లేఖతో మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం సమర్పించగా మంత్రి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు కృష్ణారెడ్డి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి, బ్రహ్మయ్య చారి, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్ లో విద్యా సంవత్సరం ప్రారంభం

ప్రజా స్ఫూర్తి, భైంసా : భైంసా పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని గాయత్రి యజ్ఞం నిర్వహించి, విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు.గుజిరిగల్లి గ్రామంలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది.ఈ సందర్భంగా గాయత్రి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని విద్యార్థులు అందంగా అలంకరించారు.నూతన విద్యార్థులకు పాఠశాల ఆచార్యులు,కమిటీ సభ్యులు సాంప్రదాయబద్ధంగా పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, పాఠశాల సమితి అధ్యక్షుడు శివకుమార్ బచ్చువార్,సభ్యుడు తోట





రాము,మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పేరుగు నవీన్ తదితరులు హాజరయ్యారు. పాల్గొన్న నాయకులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించి, ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం ఆటపాటలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు.ఈ విద్యాసంవత్స ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాఠశాల ఆచార్యులు,కమిటీ సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

* **జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**



ప్రజాస్ఫుర్తి, భైంసా: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నర్సాపూర్ (జి) మండలం కుస్లీ గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 43 ద్విచక్ర వాహనాలను,8 ఆటోలను స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఎస్పీ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా లింకులు, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గుడుంబా, తెల్లకల్లు వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు కుటుంబాలు, సమాజాన్ని నాశనం చేస్తాయని తెలిపారు.గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు. నిర్మల్ జిల్లా ఏర్పడ్డాక మొట్ట మొదటి సారిగా ఒక ఎస్పీ,తమ గ్రామానికి వచ్చినందుకు కుస్లీ వాసులు చాలా ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల తో పాటు, నిర్మల్ రూరల్ ఇన్స్పెక్టర్ కృష్ణ,ఎస్ఐ లు గణేష్,శ్రీకాంత్, రవీందర్, లింబాద్రి,పోలీసు,సిబ్బంది, సర్పంచ్,ప్రజా ప్రతినిధులు,పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.



## తాగునీటి ఎద్దడిని.. నివారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం

* **జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్**

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : తాగు నీటి ఎద్దడిని నివారించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్టలో తాగినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జలమండలి కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ముఖ్య అతిథిగా హజరై ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జగద్గిరిగుట్ట ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య ఎలా ఉంటుందో తెలియకుండా నీటి సరఫరాను చేశామని అన్నారు. బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఆడపడుచులకు ఇచ్చిన మాట ప్రకారం గోదావరి కృష్ణ నీటితో ఆడపడుచుల కాళ్లు కడుగుతాము అని చెప్పిన మాటలను నిలబెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్యే వివేకానంద , ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో రిజర్వాయర్లు నిర్మించి తాగునీటి సమస్య లేకుండా ప్రతిరోజు నీటి సరఫరాను చేయడం జరిగిందని గుర్తు చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన జగద్గిరిగుట్ట ప్రాంతంలో నీటి సమస్య ఏర్పడిందని వాపోయారు. ఇక్కడ నీటి నిల్వ కోసం రిజర్వాయర్ ఉన్నప్పటికీ వాటర్ సప్లై చేయలేక ప్రభుత్వం తన అసమర్ధతను చాటుకుంటుందని విమర్శించారు. గత కొన్ని రోజులుగా తాము జలమండలి కార్యాలయంలో ముందు నిరసన ప్రదర్శనలు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కరించకపోవడం పట్ల అధికారుల చిత్తశుద్ధి కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి తాగునీటిని సరఫరా చేయనీయెడల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మాజీ డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, మల్లేష్ గౌడ్.వేణు యాదవ్,.. పాపిరెడ్డి.పాపయ్య. గౌడ్. దాసు. విట్టల్ ముదిరాజ్. హనుమంతు. నరసయ్య వెంకటేష్. తోక యాదగిరి. సతీష్ మహేందర్ ఖలీల్ . త్రివేణి మధు. మనోజ్.. అంజయ్య. ప్రభాకర్. నర్సింహారెడ్డి. ఖయ్యూం సంతోష్. గోపాల్. తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ మలి దశ ఉద్యమకారుల సమావేశం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ, తెలంగాణ కై తెగించిపోరాడిన వారందరికీ న్యాయం జరగాలని,ఈమధ్య ఉద్యమకారుల పేరిట చాలా సంఘాలు వస్తునందున ఉద్యమకారులు ఎటు ఉండాలో తెల్చుకోలేకపోతున్నారని,గతంలో ఎవరి ఆధ్వర్యంలో పనిచేశారో వారితో ఉండడమే మంచిదని, తెలంగాణ కై కష్టపడి, నష్టపోయిన తెలంగాణ ఉద్యమకారులను నిష్పక్షపాతంగా గుర్తించి,సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమ కారులు అహ్మద్ ఖాన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమ నాయకులు దార్ల శివరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఉద్యమంలో పాల్గొన్నందుకు విద్యార్థి ఉద్యమకారుల భవిష్యత్తు అంతా నాశనం అయ్యిందని, ఏ పార్టీలో లేని విద్యార్థి ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వమే గుర్తించి సాయం చేయాలి. విద్యార్థి దశలో మేం కోల్పోయిన భవిష్యత్తును పొందలేమని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని “కమిటీల” పేరిట కాలయాపన చేయకుండా,తక్షణమే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో పాటు, గౌరవ ప్రదమైన స్థాయిలో పెన్షన్ మంజూరు చేసి ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అహ్మద్ ఖాన్, పుచ్చకాయల రామక్రిష్ణ, దార్ల శివరాజ్, దేవోజి నాయక్, బొర్రారాజు లింగన్న, ఖయ్యాం,చెక్కల అశోక్,పుచ్చ బాలకృష్ణ , షేఖ్ సాదిఖ్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సదస్సు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం నలంద డిగ్రీ కళాశాల లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమావేశంను కో ఆర్డినేటర్ పిల్లి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించడమైనది.ఈ సమావేశంలో ఉద్యమ చైర్మెన్ డా”డోలి సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసి ఉద్యమంలో కేసులపాలై,జైలుపాలై, ఉద్యమకారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకమిటి ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నాము.ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యమకారులకు న్యాయం చేయాలని,గతంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో పెట్టిన ప్రకారం అమలుచేయాలని కోరుతున్నాం. మహబూబాబాద్ జిల్లా లో జరిగిన ఉద్యమాల నేపథ్యంలో ఈనెల 21 న జరిగే సదస్సు కు మా ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ లు ప్రొ.కోదండరాం,డాక్టర్ అద్దంకి దయాకర్ లు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు హాజరుకావాలని పిలుపు ఇచ్చారు.ఈ సమావేశంలో కో ఆర్డినేటర్ పిల్లి సుధాకర్, నాయకులు డా”నెహ్రూ,మైస శ్రీనివాస్,శంతన్ రామరాజు,గుగ్గిళ్ళ పీరయ్య,దార్ల శివరాజ్, హలావత్ లింగయ్య,సోమారపు వీరాస్వామి,డా” అంబరిశ,చందులాల్,ఇమామ్,డోలి లింగు బాబు,కంబాలపల్లి సత్యనారాయణ,నలమాస సాయి,గుజ్జు దేవేందర్,చిత్తారి సోమన్న,కమ్మగాని కృష్ణమూర్తి,బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రజా స్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కుంటాల మండలం లోని ఆదర్శ పాఠశాల ను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మంగళవారం పరిశీలించారు.పాఠశాల లో డ్రైనేజీ వ్యవస్థ విద్యుత్ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం తో పలు సమస్యలను పాఠశాల ప్రిన్సిపల్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్వయానాగంట పాటు అవరణ అంతా తిరుగుతూ సమస్యలను తెలుసుకున్నారు.విద్యుత్ అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించాలని సూచించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ,విద్యార్థుల సమస్య పరిష్కారానికి తన వంతుగా పాటుపడతానని అన్నారు. విద్యార్థులకు మరింత మెరుగైనా విద్యను అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కి 48 గంటల్లో నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. అనంతరం కుంటాల సర్పంచ్ గజేందర్, మాజీ ఎం. పి. పి. గజ్జరాం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి నిధులు ఇస్తానన్న ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు చెప్పారు.

* **దౌనెల్లి లో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే**

కుంటాల మండలం లోని దౌనెల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, ప్రారంభించారు.గ్రామం లోని షేక్ సుగురా భాను కు చెందిన ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం లో అయన పాల్గొన్నారు.ఈసందర్భంగా సర్పంచ్ తో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యేను స్వాగతించి శాలువ తో సత్కరించారు.కార్యక్రమంలో సర్పంచ్ లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ లింగమంతుల స్వామి ని దర్శించుకున్న అంతటి విజయ్ కుటుంబ సభ్యులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణం లోని ప్రముఖ వ్యాపారవేత్త అంతటి విజయ్ కుటుంబ సభ్యులు మంగళవారం టేకుమట్ల శ్రీ లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి ఆలయాలను దర్శించారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జాల వెంకన్న, జాల నరసయ్య, జాల జానయ్య, జాల సైదులు తదితరులు పాల్గొన్నారు

# పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి

* **ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించి అధిక లాభాలు కలిగిన పంటలు పండించే విధంగా అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అభివృద్ధి, వానాకాలం సీజన్, సంక్షేమ పథకాల అమలు, జిల్లా ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,లు హాజరయ్యారు.వానాకాల వ్యవసాయ సన్నాహక అభివృద్ధి పథకాలు తదితరాంశాలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ వానాకాలానికి అవసరమైన విత్తనాలు,ఎరువులు, పురుగుమందుల స్టాక్, సరఫరా,నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు,కాలువలు, మిషన్ కాకతీయ పనుల పురోగతి.చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రుల్లో కొత్త వార్డులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల పనుల పురోగతి పరిశీలన. నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ఇందిరమ్మ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుపరస్తుందని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రైతు బీమా, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, 6 గ్యారంటీల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ "ప్రజారోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యత. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికీ మర్యాదపూర్వకంగా, వేగంగా వైద్యం అందాలి. అభివృద్ధి పనుల్లో జాప్యం సహించం" అని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ అడిషనల్ డిఎంఈ డాక్టర్ శ్రీనివాస్ ప్రధాన ఆస్పత్రి అభివృద్ధిపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి, నాలుగు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తీసుకున్నారు,రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు మందులు, సర్జికల్ సామాగ్రి కోసం, అదనపు నిధులు, అత్యవసర నిర్వహణ ఖర్చుల కోసం ఈ తీర్మానాలను ప్రవేశపెట్టారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్,ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు,హౌసింగ్ పీడీ, పురుషోత్తం, మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేశ్వరి,గణేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కేవలం ప్రకాష్ రెడ్డి, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఐటిఐ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల

* **మెదక్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు**




ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: తెలంగాణ ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ హైదరాబాద్ 202627 విద్య సంవత్సరానికి ప్రభుత్వ ఐటీఐ /అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్ లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మెదక్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ మెదక్ జిల్లా కన్వీనర్ గుమ్మకొండ శ్రీనివాసులు తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు సంబంధిత ట్రేడ్ అర్హతల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు,ప్రవేశాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించబడతాయి. అభ్యర్థుల అధికారిక వెబ్సైట్ iti.telangana. gov.in ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకుని దరఖాస్తు సమర్పించాలని సూచించారు.ఆగష్టు 01నాటికి 14 సంవత్సరాలు పూర్తి చేసిన వారు ప్రవేశాలకు అర్హులు, అభ్యర్థులు రూ.100 దరఖాస్తు , వెరిఫికేషన్ ఫీజును ఆన్లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఆన్లైన్ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను స్పష్టంగా స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు , అభ్యర్థులు ఇచ్చిన వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయించబడతాయి అని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు నమోదు మొబైల్ నెంబర్ కు ఎస్ ఎం ఎస్ ద్వారా సమాచారం అందజేయపడుతుందని పేర్కొన్నారు.ఒకే దరఖాస్తు ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్కువ సంఖ్యలో ట్రేడ్లు మరియు కళాశాలలకు ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి మరియు ఆధార్ నెంబర్ తప్పనిసరి అని, సీటు కేటాయింపైన తర్వాత కోర్సు పూర్తి వరకు మొబైల్ నెంబర్ మార్చరాదని హెచ్చరించారు. బోనఫైడ్, స్థానిక ,కులం, దివ్యాంగ మరియు ఓ బి సి సర్టిఫికెట్లు తెలంగాణ ప్రభుత్వం లేదా అధికృత సంస్థల చేజారీ చేయబడినవే సమర్పించాలని తెలిపారు.ముఖ్య తేదీలు ఐటిఐ/ ఎటిసి ప్రవేశాల తేదీ 30/ 2026 వరకు పొడిగించడం జరిగింది. అర్హులైన విద్యార్థులు ఈ యొక్క ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## ఈ నెల 17న హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 17న మధ్యాహ్నం 2 గంటలకు హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహ రెడ్డి తెలిపారు. శ్రీ లక్ష్మి పంక్షన్ హాల్ లో జరుగు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణ రెడ్డి హాజరవుతారన్నారు. ఇట్టి సమావేశానికి గరిడేపల్లి మండల బూత్ లెవల్ ఏజెంట్ - బీఎల్ఎలు తప్పకుండా హాజరు కావాలన్నారు. వారితో పాటు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలని కోరారు.

## ఆరుగురి జీవితాలను కాపాడిన అవయవ దాత సూరా రవికుమార్



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : నల్లగొండ జిల్లా, చర్లపల్లి గ్రామానికి చెందిన సూరా రవికుమార్ (40) ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ గా సోమవారం ఉదయం 10గంటలకు వైద్యులు నిర్ధారించారు. వారి కుటుంబ సభ్యులు తల్లి కలమ్మ, భార్య ప్రబంధ, సోదరులు రేణుకుమార్ జగదీష్ లు మానవతా దృక్పథంతో జీవన్దాన్ కార్యక్రమం ద్వారా బహుళ అవయవ దానానికి అంగీకరించి, అనేక మంది ప్రాణాలను కాపాడే మహోన్నత నిర్ణయం తీసుకున్నారు. ఆయన అవయవాలు పలువురు అవసరమైన రోగులకు నూతన జీవితం ప్రసాదించనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారు జామున 3.గం నుండి 10.గం ల వరకు అవయవ దాత శరీరం నుండి ఒక లివర్, రెండు కిడ్నీలు, ఊపిరితిత్తులు, రెండు కంటిపొరలను సేకరించారు.వీటి ద్వారా ఇద్దరు కార్నియల్ అంధులకు కంటిచూపును అందించడంతో పాటు 6 గురికి అవయవ దానం చేయనున్నారు.అనంతరం అశ్రునైనాల మధ్య పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవయవ దాన సంఘం జాతీయ అధ్యక్షుడు లయన్ ఎల్ వి కుమార్, కోఆర్డినేటర్ చిరునోముల చంద్రశేఖర్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు, మీడియా కోఆర్డినేటర్ ఏచూరి శైలజ పాల్గొన్నారు.

## వైకుంఠ రథానికి మరమ్మతులు చేయించాలి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:మృతి చెందినవారి అంతిమ సంస్కారంలో ఉపయోగించేందుకు కొత్తగూడెం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైకుంఠ రథానికి మరమ్మతులు నిర్వహించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్కి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత వైకుంఠ రథం నిరుపేదలకు ఎంతో అనుకూలంగా ఉండేదని, గత మూడు నెలల నుండి మరమ్మతులకు గురై మూలకు ఉండటంవల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రైవేటు వైకుంఠ రథాన్ని ఆశ్రయించవలసి వచ్చి పేదవారికి ఆర్థికభారం పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వైకుంఠ రథాన్ని బాగు చేయించి ఉపయోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనందాసు గడ్డ శాఖ-1 కార్యదర్శి తొగరు నరేంద్ర కుమార్, నాయకులు బానోత్ ఓం నారాయణ, ఎస్.కె జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ నవ్యాశ్రీ గౌడ్ దాతృత్వం ఇద్దరు పేద పిల్లలకు ఫీజు చెల్లింపు



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ యువతి ఆకుల నవ్యశ్రీ గౌడ్, శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థుల 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఫీజును చెల్లించి, వారి విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న నవ్యశ్రీ గౌడ్, విద్యాదానమే మహాదానమని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి పూర్తి ఫీజును చెల్లించేందుకు ప్రతి సంవత్సరం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. తాను కూడా పేదరికం నుంచి కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగం సాధించినట్లు ఆమె తన అనుభవాన్ని పంచుకున్నారు.ఈ విద్యా సంవత్సరానికి గాను ఠాకూర్ నవ్యశ్రీ (తండ్రి రాజు సింగ్), వరుణ్ తేజ్ గౌడ్ (తండ్రి బాలాజీ) అనే ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేశారు. వారిద్దరి మొత్తం వార్షిక ఫీజు రూ.32,400 ను నవ్యశ్రీ గౌడ్ చెల్లించారు. ఈ సహాయం విద్యార్థుల విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగడానికి దోహదపడుతుంది.తన అమ్మమ్మ కీ.శే. ముష్కం వినోద, తాతయ్య కీ.శే. ఆకుల సత్యనారాయణ గౌడ్, జ్ఞాపకార్థం ఈ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు నవ్యశ్రీ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆమెతో ఫోన్లో మాట్లాడి, ఆమె దాతృత్వాన్ని అభినందించారు.నవ్యశ్రీ గౌడ్ చేసిన సహాయానికి, ఆమెను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు పాఠశాల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తాయని వారు కొనియాడారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్యపుస్తకాల విక్రయం

* **ఆల్ ఫోర్స్ పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకుల ధర్నా**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలను ఏబీవీపీ నాయకులు పట్టుకోవడంతో హుస్నాబాద్ మండల విద్యాధికారి మనీలా వచ్చి పుస్తకాలను సీజ్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఆల్ఫోర్స్ పాఠశాలలో అక్రమంగా అమ్ముతున్నటువంటి పుస్తకాలు మరియు నోటుబుక్కులు సీజ్ చేపియడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలకు చదువును దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని సరస్వతి నిలయాలుగా ఉండాల్సిన పాఠశాలలే వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాలు విక్రయించి విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ చరణ్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కుమార్ కళాశాల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి అడుగు గుంటలే ప్రతిరోజూ నరకమే

* **అభివృద్ధికి ఆమడ దూరంలో అయోధ్య గ్రామం15 ఏళ్లుగా రోడ్ల దుస్థితి**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండలం, అయోధ్య గ్రామం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నప్పటికీ అభివృద్ధికి మాత్రం దూరంగానే ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించిన రహదారులు, కల్పించిన మౌలిక సదుపాయాల తరువాత గ్రామంలో పెద్దగా అభివృద్ధి జరగలేదని వారు చెబుతున్నారు.గ్రామానికి రెండు వైపులా ఉన్న రహదారులు పూర్తిగా దెబ్బతిని దశాబ్ద కాలం గడిచినా మరమ్మతులు చేపట్టలేదని, పలుమార్లు అధికార పార్టీ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. టెండర్లు పిలిచినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని వారు పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అంబులెన్స్ సేవలు కూడా సక్రమంగా అందడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. "పైనా వెలుగు లేదు కింద రోడ్డు లేదు.ప్రతి అడుగు గుంటలే, ప్రతిరోజూ నరకమే" అంటూ తమ దుస్థితిని వివరించారు.ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధి కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అయోధ్య గ్రామానికి వాటి ఫలితాలు చేరడం లేదని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బడి వయస్సు పిల్లలను బడికి పంపించాలి: ఏసీఎంఓ రమేష్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బడి వయస్సు ఉన్న పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపించాలని ఏసీఎంఓ కె. రమేష్ కోరారు. అశ్వారావుపేట మండలంలోని జీపీఎస్ కాటుకూరు, పూసుకుంట, మద్దులమాడ గిరిజన ప్రాథమిక పాఠశాలలు, ఏహెచ్ఎస్ సున్నంబట్టి పాఠశాలను ఏసీఎంఓ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం పీఎంఆర్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ప్రత్యేక నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.


## డా. బి.ఆర్. అంబేద్కర్ నేషన్ అవార్డు అందుకున్న పాల్వంచ రాజీవ్ గాంధీ



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం, ప్రజాస్ఫూర్తి : నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర,మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షులు పాల్వంచ రాజీవ్ గాంధీ డా. బి.ఆర్. అంబేద్కర్ నేషన్ అవార్డును అందుకున్నారు.హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ వ్యవస్థాపకుడు, చైర్మన్ లయన్ డా. ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పాల్వంచ రాజీవ్ గాంధీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా దళిత యువత అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం గురించి ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అంబేద్కర్ స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు, కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## అనుమతుల్లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

* **బీజేవైఎం ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో వినతి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా అనుమతులు లేని పాఠశాల పై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్, మండల అధ్యక్షుడం పబ్బు వంశీ గౌడ్ లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు వారు మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలపై యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా పాఠశాలలో బుక్స్ విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో విక్రయిస్తున్న పాఠశాలలో అడ్డుకుంటామని, అనుమతులు లేని విద్యాసంస్థలను ముట్టడిస్తామని హెచ్చరించారు. 25శాతం ఉచిత విద్యను పేద విద్యార్థులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తెలుకుంట్ల శ్రీకాంత్, సోషల్ మీడియా ఇంచార్జి గట్టు పవన్, దూసరి శివసాయి, బాతరాజు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# 163 ఎకరాల ప్రభుత్వ గైరాన్ భూమి స్వాధీనం

* **అక్రమ పట్టా రద్దు.. కోట్ల రూపాయల విలువైన భూమి ప్రభుత్వానికి పునరుద్ధరణ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : బచ్చన్నపేట మండలం సల్వాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 147లో ఉన్న 163 ఎకరాల ప్రభుత్వ గైరాన్ భూమిని జనగామ జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుని తెలంగాణ ప్రభుత్వానికి పునరుద్ధరించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా మోసపూరిత దస్తావేజులు, అక్రమ ఉత్తర్వుల ద్వారా ఈ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లినట్లు విచారణలో తేలింది.జిల్లా యంత్రాంగం నిర్వహించిన సమగ్ర విచారణలో ఈ భూమి మూల రికార్డుల ప్రకారం ప్రభుత్వ గైరాన్ భూమిగా నమోదై ఉన్నప్పటికీ, అక్రమంగా అమ్మకపు దస్తావేజులు, మ్యుటేషన్లు, పట్టాదారు పాస్‌బుక్‌లు, టైటిల్ డీడ్‌లు జారీ అయినట్లు గుర్తించారు. గతంలో జారీ చేసిన ఒక ఉత్తర్వు ద్వారా భూమిని ప్రైవేటు పట్టా భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు కూడా వెల్లడైంది.హైకోర్టు ఆదేశాల మేరకు చేపట్టిన తాజా విచారణ అనంతరం జిల్లా కలెక్టర్ మొత్తం భూమిని ప్రభుత్వ గైరాన్ భూమిగా నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అక్రమంగా జారీ చేసిన పట్టా, ఇతర రికార్డులను రద్దు చేసి భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆక్రమణలో ఉన్న సుమారు 84 ఎకరాల భూమిని పంచనామా నిర్వహించి భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.భూమిని తిరిగి నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చి, భవిష్యత్తులో ఎలాంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఈ వ్యవహారంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

## బాసర బలనటుడు వెండితెరపై మెరుపు



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా బాసరకు చెందిన గురప్ప వినయ్ కుమార్ అనే బాలుడు 'సింగ్ గీతం' సినిమాతో బాలనటుడిగా వెండితెరపై అరంగేట్రం చేశాడు.చదువుతో పాటు నటనపై ఆసక్తితో ముందుకు సాగుతున్న వినయ్ కుమార్ ప్రతిభను పలువురు అభినందించారు. ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' సినిమాలో బాలనటుడిగా నటించిన వినయ్ కుమార్,తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు.చదువుతో పాటు వినోదాత్మక కార్యక్రమాలలోనూ పాల్గొంటూ,సినీ రంగంపై తనకున్న ఆసక్తిని చాటుకున్నాడు.వినయ్ కుమార్ ప్రదర్శించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవ్వడంతో, స్థానిక మీడియా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు అతడిని సన్మానించారు.మండల టియుడబ్ల్యూజే & ఐజెయు మీడియా అధ్యక్షుడు నర్సారి భీమ్ రావు,వీడీసీ అధ్యక్షుడు నూకం లింగరావు, ఆలయ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి ఉమ్మాయి భీమ్ రావు, పిప్పర లక్ష్మణ్ రావు తదితరులు వినయ్ కుమార్ ను సత్కరించి,సినీ రంగంలో ఉన్నతశిఖరాలు,అధిరోహించాలనిఆకాంక్షించారు.భవిష్యత్తులో టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి వంటి ప్రముఖుల దర్శకత్వంలో నటించే అవకాశం దక్కించుకోవడానికి తన వంతు సహకారం అందిస్తానని మీడియా ప్రతినిధులు వినయ్ కుమార్ కు భరోసా ఇచ్చారు.అతడి ప్రతిభకు తగిన గుర్తింపు లభించడం పట్ల స్థానికంగా సంతోషం వ్యక్తమవుతోంది.

## భూ పోరాటాలను ఉధృతం చేయాలి

: **జి.నాగయ్య**



లింగాల ఘణపురం / జనగామ, ప్రజాస్ఫూర్తి : పేదలకు భూమి దక్కే వరకు పోరాటం ఆగకూడదని, జిల్లా వ్యాప్తంగా భూ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని తెలంగాణ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షు లు జి.నాగయ్య పిలుపునిచ్చారు. మం గళవారం మండల కేంద్రం లో నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సం ఘం మూడవ జిల్లా మహాసభల్లో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథ కానికి నిధులు తగ్గిస్తూ పేదలకు ఉపాధి ని దూరం చేసే ప్రయత్నం చేస్తోందని ఆ యన ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, ని త్యావసర వస్తువుల ధరల పెరుగుదల తో పేదల జీవనం భారంగా మారింద న్నారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మోకు కన కారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధర లకు అనుగుణంగా వ్యవసాయ కూలీ ల కూలి రేట్లు పెంచాలని కోరారు. వ్యవ సాయ రంగంలో యాంత్రికరణ పెరగ డం, పని దినాలు తగ్గిపోవడం వల్ల గ్రా మీణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహా సభల్లో జిల్లా కార్యదర్శి సింగారపు రమే ష్‌తో పాటు పలువురు నాయకులు,వ్య వసాయ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.

## నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

: **ఏసీపీ భీమ్ శర్మ**




రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ ఘనపూర్ ఏసీపీ భీమశర్మ అన్నారు. మంగళవారం సాయంత్రం రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద ప్రజలకు సైబర్ నే గంజాయి. గుట్కా, హెల్మెట్, సీసీ కెమేరా వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని. ఏదైనా కార్యాలయం నుంచి ఫోన్ చేసి ఓటీపీ అడిగితే, ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదని. అలా చెబితే బ్యాంకులో ఉన్న నగదు మొత్తం దోచుకుంటారని వారు అన్నారు. గుట్కా, 1 గంజాయికి యువత దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్నిపత్రాలు కలిగి ఉండాలని. వాహనదారులు మద్యం సేవించి షాహనాలు నడుపరావని సూచించారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ప్రమాదాలు కొనితెచ్చుకోవదన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, దొంగలపట్ల అపరిచిత వ్యక్తులపట్ల అనుమానాస్పదంగా కనిపిస్తే అలాంటి వ్యక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని, వెంటనే వందకు డయల్ 100కి సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930కి కాల్ చె యాలని అన్నారు. ఈకార్యక్రమంలో జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రఘునాథపల్లి ఎస్ఐ డి.నరేష్, గ్రామసర్పంచ్ సింగిరెడ్డి సునీత శ్రీనివాస్ రెడ్డి. ఉప సర్పంచ్ ఎడ్ల బాలరాజు, వార్డు సభ్యులు తదితరులు పాల్గన్నారు.

## కొందుర్గు ఉప సర్పంచ్ల కమిటీ అధ్యక్షుడిగా చక్కని మహేష్ యాదవ్ ఎన్నిక

* **కొందుర్గు ఉప సర్పంచ్ల కమిటీ ఏర్పాటు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఉప సర్పంచ్ల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసి, అధ్యక్షుడిగా చిన్నఎల్కిచర్ల గ్రామానికి చెందిన చక్కని మహేష్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఫరూక్‌నగర్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఫోరం సభ్యులు మల్కాయ్ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా చిప్ప చంద్రశేఖర్ (కొందుర్గు), ఉపాధ్యక్షులుగా మంగన్నగారి దామోదర్ రెడ్డి, డి. రాము (తంగళ్లపల్లి), ప్రధాన కార్యదర్శిగా కుంటోల నరేష్ (భైరంపల్లి), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రమేష్‌నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాగులపల్లి వెంకటేష్‌గౌడ్ (లక్ష్మీదేవిపల్లి), బడికల మహేష్ (ఆగిరాల), కోశాధికారిగా మహమ్మద్ అలీమ్ (ఉత్తరాస్పల్లె), ప్రధాన సలహాదారులుగా గండేటి రాజనర్సింహారెడ్డి (విశ్వనాథపూర్), రవిచంద్ర రెడ్డి (లాలాపేట్)లను ఎంపిక చేశారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సంఘం నాయకులు అభినందించారు. ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి

* **జిల్లా వ్యవసాయ అధికారిణి, స్వరూప రాణి**



అక్కన పేట , ప్రజాస్ఫూర్తి : అక్కన్నపేట మండలం రామవరం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన సిద్ధిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు.ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తదితర ప్రకృతి సిద్ధమైన ద్రావణాల తయారీ విధానం, ఉపయోగాలను ఆమె వివరించారు. అంతేకాకుండా రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి స్వరూప రాణి మాట్లాడుతూ, పర్యావరణ హితమైన పద్ధతులను అవలంబిస్తున్న రైతులను అభినందించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి నేల ఆరోగ్యం మెరుగుపడి, రసాయన రహిత పంటలు పండుతాయని తెలిపారు. రైతులు యూరియా యాప్‌లో బుకింగ్ చేసుకుని మాత్రమే యూరియా తీసుకోవాలని యాప్‌లో ఏదైనా సలహాలు, సూచనల నిమిత్తం వ్యవసాయ శాఖ నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయాన్ని స్థిరంగా మార్చేందుకు రైతు నేస్తం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. జ్ఞానాన్ని పంచుకునేందుకు రైతు వేదికలను వినియోగించుకోవాలని, తెగుళ్ల నివారణకు జీవామృతం, నీమాస్త్రం వంటి తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, కుందన్‌వానిపల్లి సర్పంచ్ పొన్నాల వెంకమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ స్వామి రెడ్డి, ఫెర్టిలైజర్ డీలర్లు , రైతులు శంకర్, కర్ణాకర్, సమ్మయ్య,రైతులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

: **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.మంగళవారం మండలం లోని ఓబు ల్ కేశవాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా కార్యక్రమాల నిర్వహణ, మౌలిక సదుపా యాలు, విద్యార్థుల హాజరు,పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్ర భుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు."బడిబాట" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, పాఠశాల వయసు పిల్లలందరినీ గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు వివరాలను పరిశీలించిన కలెక్టర్, డ్రాప్ ఔట్స్ లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. పాఠశాల వంటగదిని తనిఖీ చేసి, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత,పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడిన కలెక్టర్,గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, పాఠశాల పరిసరాలు,ఆటస్థలం పరిశుభ్రంగా ఉండేలా చర్య లు తీసుకోవాలని సూచించారు.ఈ సం దర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, వారి చదువులు,లక్ష్యాలు, అభి రుచుల గురించి తెలుసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్స హించారు. విద్యా ప్రమాణాల పెంపు, వి ద్యార్థుల శ్రేయస్సు, పాఠశాలలో పరిశు భ్రమైన వాతావరణం కల్పనలో ప్రతి ఒ క్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




## మోదీ పాలన.. దేశ ప్రజలకు తీవ్ర నిరాశే మిగిల్చింది

: **ఎం.డి. జహంగీర్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 12ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరాశే మిగిల్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్ ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సిపిఎం పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎండి జహంగీర్ హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోగా, నిరుద్యోగం మరింత పెరిగిందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధానాలను బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష శక్తులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, ఎండి పాషా, రాగీరు కిష్టయ్య, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ముత్యాలు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, ఆదిమూలం నందీశ్వర్, పొట్ట శ్రీనివాస్, అంతటి అశోక్, జక్కిడి దేవేందర్ రెడ్డి, చెరుకు లక్ష్మమ్మ, కొంతం సుశీల, బొడ్డు అంజిరెడ్డి, తొర్పునూరి మల్లేశం, మొగుదాల రాములు, చప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చీకూరి ఈదయ్య, బొమ్మకంటి కృష్ణ, యాట బాలరాజు, కొంతం శ్రీనివాస్ రెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, చేరిక అలివేలు, ఎండి రేష్మ, ఎండి ఆసియా, నేరెడు మహేష్, తీగుళ్ల శ్రీను, నిలుగొండ నరేష్, చీమకొండ శ్రీరాములు, యాట ముత్యాలు, జంగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం.. బీఎల్ఓలకు కలెక్టర్ శిక్షణ



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.అర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడం లో బూత్ లెవల్ అధికారుల పాత్ర అ త్యంత కీలకమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోమ్ తో కలిసి ఈఆర్ఓలు,ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్లు, బీఎల్ఓలకు ఎస్ఐ ఆర్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మం చేపట్టనున్నట్లు తెలిపారు. మర ణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లి నవారు, డూప్లికేట్ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూ పొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి బీఎల్ఓ తమ పరి ధిలోని ప్రతి ఇంటిని సందర్శించి డిక్లరేష న్ ఫారాలు పంపిణీ చేయడంతో పాటు, వాటి స్వీకరణకు సంబంధించిన అంగీ కార పత్రాలను తప్పనిసరిగా తీసుకోవా లని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా ప్ర త్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సేకరించిన వివరాల ఆధారంగా జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా వి డుదల చేయనున్నట్లు, అనంతరం ఆ గస్టు 30 వరకు అభ్యంతరాలు, సవర ణలు స్వీకరించి అక్టోబర్ 1న తుది ఓ టర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు.అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు ఎ న్యూమరేషన్ ప్రక్రియ, బీఎల్ఓ యాప్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రెజెంటే షన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం ఈ ప్రక్రియకు సంబంధించిన గోడ పత్రిక లను ఆవిష్కరించి,అవసరమైన మెటీరి యల్ బ్యాగులను ఏఈఆర్ఓలకు అం దజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, త హసీల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

* **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు మరియు నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా దాదాపు 24సంవత్సరాల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నెల రోజుల పాటు నిర్వహించే ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు. జూన్ 25 నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, జూలై 24 వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి 'హౌస్ టు హౌస్' సర్వే నిర్వహిస్తారని ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షేత్రస్థాయిలోనే 'బిఎల్ఓ యాప్' ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వేలో ప్రధానంగా 2002 నాటికి ఓటరుగా నమోదై, ప్రస్తుతం ఉన్న వారి వివరాలను ధృవీకరిస్తారని, ఒకవేళ 2025 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే, వారిని తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓటరు పేరు, తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఈ సవరణల ప్రకారం వాటిని సరిచేస్తారన్నారు. చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తారని, నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సరైన సమాధానం లేదా ఆధారాలు ఇవ్వకపోతే ఓటును తొలగిస్తారని చెప్పారు. తుది డ్రాఫ్ట్ జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్డీఓలు నోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి లేదా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన వారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటించే నాటికి ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా తయారీకి బిఎల్ఓలు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవోలు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ వి రమేష్, పి వెంకటేశ్వర్లు తహసీల్దార్లు ఏఎల్ఎంటి లు సూపర్వైజర్లు, టెక్నికల్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో ఎవరు ఏ పార్టీనో తెలియడం లేదు: ఎంపీ అర్వింద్

రాయికల్: జగిత్యాల జిల్లాలో ఏ నాయకుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియడం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ధర్మాజీపేటలో పల్లె దవాఖానా నూతన భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాకు కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.3 లక్షలు ఇచ్చిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలు చేయొద్దని, నేతల ఫ్లెక్సీల కోసం పెట్టిన ఖర్చు ఆరోగ్య కేంద్రానికి వెచ్చిస్తే మరింత అభివృద్ధి జరిగేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన యూరియా యాప్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మాట్లాడిన అనంతరం ఎంపీ తనకు పని ఉందని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తాను రెండున్నర గంటలు ఎంపీ కోసం వేచి చూస్తే సభా మర్యాద పాటించకుండా మధ్యలోనే వెళ్లిపోయారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఎస్టీ రూపంలో కేంద్రానికి వెళ్లే రూ.100లో రూ.41 మాత్రమే తెలంగాణకు నిధుల రూపంలో ఇస్తున్నారని పేర్కొన్నారు. యూరియా సరఫరాలో కేంద్రం కోత విధించినందునే రాష్ట్ర ప్రభుత్వం యాప్ తీసుకొచ్చిందన్నారు. ఎంపీ అహంకారంతో మాట్లాడుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైతే తాను కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. పల్లె దవాఖానాకు తన నియోజకవర్గ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

# జూనియర్ కళాశాలల్లో మరమ్మత్తు పూర్తి చేయాలి

**: కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, ఇంజినీరింగ్ అధికారులతో కళాశాలల్లో కొనసాగుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు రూ.3.31 కోట్ల వ్యయంతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న విద్యుదీకరణ, మరుగుదొడ్ల మరమ్మత్తులు, నూతన తరగతులు గదుల నిర్మాణం, భవనాల మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని కళాశాలల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

*** భూసేకరణ వేగవంతం చేయాలి**

జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, భూసేకరణ శాఖల అధికారులతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, పులుసుబొంత ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెండింగ్ అనుమతులు, సమస్యలు, పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, డిఆర్ఓ పద్మావతి, ఆర్ఐ ఓ మధు, సంబంధిత మండలాల తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, భూ సర్వే అధికారులు పాల్గొన్నారు.

*** అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతోపాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఆళ్లపల్లి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ విభాగం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు అందిస్తున్న బోధన విధానం, విద్యా కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆళ్లపల్లి తహశీల్దార్ ఉషారాణి, ఎంఈఓ శాంతారావు ఉన్నారు.

# యాప్‌లో యూరియా బుకింగ్.. రైతువేదికల్లో పంపిణీ: సీఎం రేవంత్



హైదరాబాద్: బోనస్ ఇచ్చే 7 రకాల సన్నవడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వాటిపై రైతులకు సబ్సిడీ ఇవ్వాలని సూచించారు. వ్యవసాయశాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. "సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలి. వ్యవసాయశాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి. అగ్రికల్చర్ వర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకోవాలి. వడ్ల కొనుగోళ్లలో అగ్రికల్చర్ వర్సిటీతో సమన్వయం చేసుకోవాలి. అన్ని ఫెర్టిలైజర్స్‌కు యాప్ అందుబాటులోకి తీసుకురావాలి. యాప్‌లో బుక్ చేసుకునే యూరియాను రైతువేదికల్లో పంపిణీ చేయాలి. జిల్లా అదనపు కలెక్టర్‌కు ఈ బాధ్యతను అప్పగించాలి. యూరియా, ఎరువుల కేటాయింపులపై తరచూ కేంద్రానికి లేఖలు రాయాలి. రామగుండంలో తయారయ్యే మొత్తం ఎరువులు రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి" అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

# 5 ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్..
# నరహరి అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే!





హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ.1.54కోట్ల నగదు, రూ.5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యా ప్రమాణాలు
# నేడు ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం






హైదరాబాద్: విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యను కొత్త దిశలో తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (TPS) కార్యక్రమానికి ప్రజా ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డ్రీమ్ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఆరుట్లకు చేరుకునే ముఖ్యమంత్రి, ముందుగా పాఠశాల పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. అనంతరం కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యాధునికంగా రూపొందించిన డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్ ల్యాబ్స్, లైబ్రరీ, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా భేటీ అయ్యి వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం చేయనున్నట్లు సమాచారం. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జోష్నా శివారెడ్డి పర్యవేక్షణలో ఆరుట్లలోని ఈ పాఠశాల రూపుదిద్దుకుంది. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేలా టీపీఎస్‌ను తీర్చిదిద్దారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు ఆధునిక సాంకేతిక పద్ధతులు ఈ స్కూల్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ వంటి సమగ్ర వసతులు కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల నమ్మకాన్ని పెంచే దిశగా ఈ మోడల్ స్కూల్‌ను రూపొందించారు.




## తెలంగాణ రక్షణ సేన అధినేత్రి
# కవిత కార్యక్రమంలో ఉద్రిక్తత

శ్రీరాంపూర్: తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గేట్లను తోసుకొని కవిత, పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. 'బొగ్గుబాయి' కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటుందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని ఈ సందర్భంగా కవిత అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. అడవిలో అన్నలు లేరని సింగరేణి యాజమాన్యం కార్మికులను వేధిస్తోందన్నారు. అన్నలు తమ పార్టీలో కూడా ఉన్నారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు.

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్




ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో
# ఇద్దరు యువకుల దుర్మరణం



మహబూబ్‌నగర్: జాతీయ రహదారిపై భూత్పూరు వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రగా గాయపడ్డారు. అమిస్తాపూర్‌కు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, పి.రాజు మరో యువకుడు ద్విచక్ర వాహనంపై భూత్పూర్ ఫ్లై ఓవర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలో డీసీఎం, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు గుర్తించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

# కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు.

## ఓటరు జాబితా సవరణ... బూత్ లెవల్ క్యాడర్ కు మంత్రి సీతక్క దిశానిర్దేశం



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై తెలంగాణ మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల వ్యవస్థకు వెన్నెముక వంటివారని అన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమకు కేటాయించిన హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, క్షేత్రస్థాయిలో ఓటర్లకు అండగా నిలవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతినకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## 6 నెలల్లో 23 కంపెనీలు..
## ఇంకా 235 ఐపీఓలు వెయిటింగ్!




దిల్లీ: వారానికి కనీసం ఒకట్రెండు ఐపీఓలు.. నెలలో ఒక్క కంపెనీ గురించైనా చర్చ.. బంపర్ సబ్‌స్క్రిప్షన్‌లు.. అదిరిపోయే లిస్టింగ్‌లు.. గతేడాది ఐపీఓల పరిస్థితి. ఈ ఏడాది ప్రాథమిక మార్కెట్ అందుకు భిన్నంగా నడుస్తోంది. 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తోంది. ఇప్పటి వరకు 23 కంపెనీలు కేవలం రూ.27వేల కోట్లు మాత్రమే సమీకరించాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థూల ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా మందగమనం నెలకొంది. ఈ మేరకు ఈక్విరస్ క్యాపిటల్ మంగళవారం ఓ నివేదిక వెలువరించింది. 2025లో 103 ఐపీఓలు సందడి చేశాయి. మార్కెట్ నుంచి సంయుక్తంగా రూ.1.76 లక్షల కోట్లు సమీకరించాయి. 2024లో 90 సంస్థలు రూ.1.6 లక్షల కోట్లు, 2023లో 57 కంపెనీలు రూ.49,436 కోట్లు సమీకరించాయి. గతేడాది సెప్టెంబర్ 25న ఒక్కరోజే 25 ఇష్యూలు వచ్చాయి. 2025 క్యాలెండర్ సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకంగా 30 కంపెనీలు రూ.91,058 కోట్లు సమీకరించాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 19 కంపెనీలు రూ.24,772 కోట్లు నిధులు పొందాయి. రెండో త్రైమాసికంలో నాలుగు కంపెనీలు కేవలం రూ.2,422 కోట్లు మాత్రమే సమీకరించాయి. ముఖ్యంగా గతేడాది సెప్టెంబర్ తర్వాత మార్కెట్ పరిస్థితులు ప్రతికూలంగా మారడం, మదుపర్ల అప్రమత్తత కారణంగా ఐపీఓల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అయితే, ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతోంది. ఐపీఓ కార్యకలాపాలు పుంజుకొంటున్నాయి. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్, హెక్సాగాన్ న్యూట్రిషన్ వంటి కంపెనీలు జూన్ నెలలో ఐపీఓకు వచ్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో మరికొన్ని కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి. టర్టల్‌మెంట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ (జూన్ 19), అద్వైత్ జువెల్స్ (జూన్ 23) సంస్థలు జూన్ నెలలో పబ్లిక్ ఇష్యూకు రానున్నాయి. వాటర్‌వేస్ లీజర్ టూరిజం కూడా ఈ నెలలోనే పబ్లిక్ ఆఫర్‌కు వస్తోంది. దేశంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ ఈ వారం సెబీ వద్ద తన ప్రాథమిక పత్రాలను దాఖలు చేయనుంది. క్విక్ కామర్స్ సంస్థ జెప్టో, ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్స్ వచ్చే నెలలో ఐపీఓలు తీసుకురానున్నట్లు సమాచారం. మొత్తంగా 2026 మే నాటికి 236 మెయిన్‌బోర్డ్ ఐపీఓ డ్రాఫ్ట్ పేపర్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. ఇందులో 163కి సెబీ అబ్జర్వేషన్స్ వచ్చాయి. మరో 73 కంపెనీలు ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయని ఈక్విరస్ క్యాపిటల్ పేర్కొంది.

## మరింత స్మార్ట్‌గా ఫేస్‌బుక్.. కొత్తగా 3 ఏఐ ఫీచర్లు

సోషల్ మీడియా దిగ్గజం మెటా తన ఫేస్‌బుక్ ప్లాట్‌ఫామ్‌లో సరికొత్త ఏఐ ఫీచర్లను తీసుకొచ్చింది. యూజర్లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి ప్రధానంగా ఏఐ మోడ్ అనే సెర్చ్ ఆప్షన్ అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా ఫొటోలు, వీడియోలు మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ఏఐ ఎడిటింగ్ టూల్స్‌ను ప్రవేశపెట్టింది.



* ఫేస్‌బుక్ సెర్చ్ ట్యాబ్‌లో కొత్తగా ఏఐ మోడ్‌ను తీసుకొచ్చారు. ఏదైనా సమాచారానికి సంబంధించి ప్రశ్నలు, సలహాలు, సూచనలు అడిగినప్పుడు ఏఐ సెర్చ్ మోడ్ మెటా యాప్స్‌లోని గ్రూపులు, రీల్స్‌లో పబ్లిక్‌గా అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి సమాధానాలు చెబుతుంది. సాధారణ సెర్చ్ రిజల్ట్ స్థానంలో ఇకపై ఏఐ సమాధానాలు కనిపిస్తాయన్నమాట.
* ఫొటోలు, వీడియోల కోసం ఏఐ అసిస్టెంట్ టూల్‌ను తీసుకొచ్చింది. క్రేజీ వీడియోల కోసం ఆటోమెటేడ్ ట్రాన్సిషన్ ఎఫెక్ట్, కొల్లాజ్ కటౌట్ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. కొల్లాజ్ కటౌట్ టెంప్లేట్స్ ద్వారా మీ కెమెరా గ్యాలరీ నుంచి స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తించి, ఆటోమేటిక్‌గా చక్కని కొల్లాజ్‌లుగా మార్చడానికి సలహాలను ఇస్తుంది. ట్రాన్సిషన్ ఎఫెక్ట్స్ ద్వారా మీ ఫొటోలు, వీడియోలను కలిపి స్మూత్, స్టైలిష్ వీడియో మొంటేజ్‌లుగా మార్చడానికి ఉపయోగపడుతుంది.
* ఏఐ ఫొటో ఎడిటింగ్‌ను కూడా తీసుకొచ్చింది. ఏఐ సాయంతో మీ ఫొటోల్లోని దుస్తులు, హెయిర్ స్టైల్, యాక్సెసరీస్ సులభంగా మార్చుకోవచ్చు. క్రియేటివ్‌గా, ఫన్నీగా ఫొటోలను ఎడిట్ చేసుకునేందుకు ఈ ఆప్షన్ పనికొస్తుంది. మీరు అభిమానించే స్పోర్ట్స్ టీమ్ జెర్సీని వర్చువల్‌గా ధరించి సెలబ్రేట్ చేసుకోవచ్చు. స్టోరీస్‌లో ఏఐ ఎడిట్ ఐకాన్‌పై క్లిక్ చేసి 'వేర్ ఇట్' ఎంచుకోవడం ద్వారా లేదా ప్రొఫైల్ పిక్చర్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'రీస్టైల్ ప్రొఫైల్ పిక్చర్ విత్ ఏఐ' ద్వారా మార్చుకోవచ్చు.

## అమెజాన్‌ను దాటేసిన స్పేస్‌ఎక్స్.. దూసుకెళుతున్న షేర్లు

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ షేర్లు దూసుకెళుతున్నాయి. నాస్‌డాక్‌లో మంగళవారం ఆ కంపెనీ షేర్లు 14 శాతం మేర లాభపడ్డాయి. దీంతో అమెరికా దిగ్గజ కంపెనీ అయిన అమెజాన్‌ను అధిగమించి ఐదో స్థానానికి చేరువైంది. మైక్రోసాఫ్ట్‌కు చేరువైంది. ఐపీఓకు వచ్చిన కొద్దిరోజుల్లోనే స్పేస్‌ఎక్స్ ఈ మైలురాయిని చేరుకోవడం గమనార్హం. 135 డాలర్ల ఇష్యూ ధర వద్ద ఐపీఓకు వచ్చిన స్పేస్‌ఎక్స్ షేర్లు మంగళవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో 14.3 శాతం లాభంతో 220 డాలర్లకు చేరుకుంది. అంటే ఇష్యూ ధరతో పోలిస్తే 62 శాతం అధిక ధర వద్ద షేర్లు ట్రేడవుతున్నాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 2.85 ట్రిలియన్ డాలర్లకు (షేరు ప్రస్తుత ధర వద్ద) చేరుకుంది. అమెజాన్ మార్కెట్ విలువ 2.64 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇదే దూకుడు కొనసాగితే మైక్రోసాఫ్ట్‌ను (2.92 ట్రిలియన్ డాలర్లు) అధిగమించే అవకాశం ఉంది. స్పేస్‌ఎక్స్ షేర్ల దూకుడుతో ఎలాన్ మస్క్ సంపద 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది.

* టాప్3 కంపెనీలు: మార్కెట్ విలువ పరంగా ఎన్విడియా (5 ట్రిలియన్ డాలర్లు), యాపిల్ (4.3 ట్రిలియన్ డాలర్లు), అల్ఫాబెట్ (4.4 ట్రిలియన్ డాలర్లు) టాప్3 స్థానాల్లో ఉన్నాయి.




## ₹8 వేల వరకు స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచిన వన్‌ప్లస్



స్మార్ట్‌ఫోన్‌ల ధరలకు రెక్కలొస్తున్నాయి. రోజురోజుకూ మరింత కాస్ట్లీగా మారిపోతున్నాయి. శాంసంగ్, వివో, రియల్‌మీ, ఐకూ వంటి సంస్థలు ధరల పెంపు చేపట్టగా.. తాజాగా వన్‌ప్లస్ (One Plus) తన వన్‌ప్లస్ 15, నార్డ్ సీఈ 6 లైట్ ఫోన్ల ధరలను రూ.8 వేల వరకు పెంచింది. సవరించిన ధరలు కంపెనీ వెబ్‌సైట్‌లో అమల్లోకి వచ్చాయి. ఫోన్ విడిభాగాల ధరలు పెరుగుదలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వన్‌ప్లస్ 15 స్మార్ట్‌ఫోన్ ధర 12GB + 256GB వేరియంట్ ధర రూ.77,999 నుంచి రూ.85,999కు పెరిగింది. విడుదల సమయంలో దీని ధర రూ.72,999 కావడం గమనార్హం. అదేవిధంగా 16GB + 256GB వేరియంట్ ధర రూ.85,999 నుంచి రూ.93,999కి పెరిగింది. వన్‌ప్లస్ నార్డ్ సీఈ 6 లైట్ స్మార్ట్‌ఫోన్ ధర కూడా రూ. 23 వేల వరకు పెరిగింది. 6GB + 128GB వేరియంట్ ధర రూ. 22,999 నుంచి రూ.25,999కి చేరింది. 8GB + 128GB వేరియంట్ ధర రూ.25,999 నుంచి 27,999, 8GB + 256GB వేరియంట్ ధర రూ. 28,999 నుంచి 30,999కు సవరించింది.

## వరుసగా రెండు ఓటములు..
## అఫ్గాన్ చేతిలో ఇండియా 'ఎ' భవితవ్యం



శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ 'ఎ' జట్టు ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ వంటి ప్రతిభావంతులున్నా ఇండియా 'ఎ' జట్టు ఆశించిన ప్రదర్శన చేయట్లేదు. దీంతో జట్టు టైటిల్ గెలవడం కాదు కదా కనీసం ఫైనల్‌కు చేరడం కూడా కష్టంగా కనిపిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని ఈ యువ జట్టు శ్రీలంక 'ఎ'పై ఓటమి అంచుల వరకు వెళ్లి చివరకు ఎనిమిది పరుగుల తేడాతో గట్టెక్కింది. తర్వాత అఫ్గాన్‌తో మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించినా బౌలర్లు చేతులెత్తేశారు. దీంతో ఆ మ్యాచ్‌లో భారత్ DLS ప్రకారం 4 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇక, తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ నిరాశపర్చడంతో భారత్ భారీ స్కోరు చేయలేకపోయింది. బౌలింగ్ దళం కాస్త మెరుగైన ప్రదర్శన చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్ దాకా వెళ్లినా చివరకు ఓటమే ఎదురైంది.

**ఫైనల్‌కు చేరుతుందా?**

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండియా ఎ జట్టు ఫైనల్‌కు చేరాలంటే బుధవారం అఫ్గాన్‌తో ఆడాల్సిన చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాలి. అది కూడా భారీ విజయమై ఉండాలి. అలా అయితేనే భారత్ ఎ ఫైనల్ చేరే అవకాశాలుంటాయి. ఒకవేళ అఫ్గానిస్థాన్ చేతిలో ఓడితే తిలక్ సేన ఇంటిముఖం పట్టాల్సిందే. అదే సమయంలో అఫ్గాన్ తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తే సమీకరణాలు మరింత క్లిష్టంగా మారతాయి. ఎందుకంటే అఫ్గానిస్థాన్‌పై ఇండియా.. శ్రీలంకపై అఫ్గాన్ విజయం సాధిస్తే అప్పుడు మూడు జట్లూ నాలుగేసి పాయింట్లతో ఉంటాయి. మెరుగైన నెట్ రన్‌రేట్ ఉన్న మొదటి రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఒకవేళ అఫ్గాన్ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే భారత్, శ్రీలంక ఫైనల్‌లో తలపడతాయి.

**ఇండియా ఎ జట్టులోకి అశోక్ శర్మ**

ఇండియా ఎ జట్టులోకి ఫాస్ట్‌బౌలర్ అశోక్ శర్మను తీసుకున్నారు. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని యుధ్వీర్ సింగ్ భుజం గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలిగాడు. అతడి స్థానంలో అశోక్‌ను ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026లో గుజరాత్‌కు ఆడిన అశోక్.. ఓ మ్యాచ్‌లో 154.2 కి.మీ. వేగంతో బంతిని విసిరి వార్తల్లో నిలిచాడు.

## టీజీ20 లీగ్.. బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ




హైదరాబాద్: తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హెచ్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి మొదలుకానున్న ఈ టోర్నీకి ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌గా శ్రీనిధి యూనివర్సిటీ ఎంపికయింది. లీగ్ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంచైజీలు ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నాయి. బుధవారం ట్యాంక్‌బండ్‌పై ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇటీవల నెక్లెస్ రోడ్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ డిస్‌ప్లే షోలో జట్ల లోగోలను నిర్వాహకులు ప్రదర్శించారు. లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. ప్రతి జట్టు మిగతా అన్ని టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనున్నాయి. జూన్ 23న పాలమూరుతో జరిగే మ్యాచ్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తలపడనుంది. బేగంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు, హెచ్‌సీఏ, ఫ్రాంచైజీల యాజమానులు హాజరయ్యారు. టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు లీగ్ వివరాలను వెల్లడించారు. విజేత జట్టుకు రూ.కోటి నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.50 లక్షలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లను రూ.25 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో తొలి మ్యాచ్‌కు ముందు వేడుకలు ఉంటాయన్నారు. సంగీత దర్శకుడు తమన్ మ్యూజిక్ కాన్సర్ట్, లేజర్ షో ఉంటుందని పేర్కొన్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్ప ఐపీఎల్‌లోని అన్ని రూల్స్ ఈ లీగ్‌లో ఉంటాయని.. డిస్ట్రిక్ యాప్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. టికెట్ల ధరలు రూ.50, రూ.100గా నిర్ణయించామన్నారు. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తరఫున హాజరైన ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి మాట్లాడారు. "టీజీ20 లీగ్ రూపంలో అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, రామోజీ గ్రూపు ఎల్లప్పుడూ క్రీడలను ప్రోత్సహిస్తాయి. ఈనాడు క్రికెట్ ఛాంపియన్ షిప్, లక్ష్య వంటి కార్యక్రమాలు చేపడుతూ క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తున్నాయి. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌తో పాటు అన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలి. ఆ ప్లేయర్లు జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలి. అందరం కలిసి ఈ లీగ్‌ను మరింత ముందుకు తీసుకెళ్దాం" అని అన్నారు.




## నా పరువుకు నష్టం కలిగించేలా
## తప్పుడు ప్రచారం.. గంగూలీ ఫిర్యాదు



సోషల్ మీడియాలో తన పరువుకు నష్టం కలిగించే కంటెంట్ ప్రచారం అవుతోందని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'సౌరభ్ గంగూలీ ఫ్యాన్స్' అనే అనధికార ఫేస్‌బుక్ పేజీతోపాటు మరో మీడియా సంస్థ తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కల్పిత సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. "నా ప్రతిష్ఠను దెబ్బతీసి ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించే ఉద్దేశంతో ఆ పేజీ నిరంతరం పోస్టులను షేర్ చేస్తోంది. ఒక ప్రముఖ వ్యక్తిగా అభిప్రాయాలు, విమర్శలు ప్రజా జీవితంలో భాగమని నాకు తెలుసు. అయితే, నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే, పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచారం చేయడం ఆమోదయోగ్యం కాదు. ఈ పేజీని నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి" అని గంగూలీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్..
## సెమీస్‌లో భారత్



ఆక్లాండ్: నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్ ఎ రెండో మ్యాచ్‌లో భారత్ 2-1 తేడాతో జపాన్‌ను ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్‌సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. ప్రత్యర్థి జట్టులో హిరామిట్సు 35వ నిమిషంలో గోల్ చేసింది. వరుసగా రెండు విజయాలు సాధించి పూల్ ఎలో ఆరు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో ఉంది. జూన్ 18న జరిగే తమ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో ఉరుగ్వేతో తలపడనుంది.

## సినిమా



SREE LEELA



# చుక్కలు తెమ్మన్నా తెంచుకురానా

శ్రీలీల తెలుగులో ఫస్ట్ టైమ్ ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మద్యపాన నిషేధం బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానున్నట్లు సమాచారం. 1994లో మద్యపాన నిషేధం విధించిన తర్వాత జరిగిన పరిణామాలతో వేణు ఊడుగుల మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి చుక్కలు తెమ్మన్నా తెంచుకురానా అనే టైటిల్‌ను పరిశీలిస్తోన్నారట. ఈ సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా ఫైనల్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. లేడీ ఓరియెంటెడ్ జానర్‌తోనైనా మళ్లీ సక్సెస్ బాట పడుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాకు రమేష్ ఎలిగేటి దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు సమాచారం.

## బన్నీ సాంగ్‌తో మోదీ పోస్ట్.. వైరల్

ప్రధాని మోదీ కారణంగా అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ మూవీ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం స్లోవేకియా పర్యటనలో ఉన్న మోదీ ఆ దేశ అధ్యక్షుడితో దిగిన ఈ ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేయగా అది కాస్త వైరలవుతోంది. స్లోవేకియా ప్రెసిడెంట్ నుంచి ఓ బహుమతిని స్వీకరిస్తున్న ఫొటోను మోదీ తన ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. ఈ పోస్ట్‌కు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో అల్లు అర్జున్ ఏఏ 23 మూవీ థీమ్‌సాంగ్‌ను ఉపయోగించారు. అయితే గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేసేందుకు మోదీ మోడ్రన్ మ్యూజిక్ వాడుతున్నారు. యూత్‌ను ఆకర్షించేందుకు న్యూ ఏజ్ మ్యూజిక్ ఉపయోగిస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఎక్కువగా హిందీ సాంగ్స్‌నే వాడుతుండగా ఫస్ట్ టైమ్ ఓ తెలుగు సినిమా పాట.. అందులోనూ బన్నీ మూవీ సాంగ్ వాడటంతో టాలీవుడ్ ఫ్యాన్స్ తెగ ఖుషి అవుతున్నారు. బన్నీ క్రేజ్‌కు నిదర్శనమిదని అంటున్నారు. మోదీ పోస్ట్‌ను అల్లు అర్జున్ ఫ్యాన్స్ తెగ షేర్ చేస్తున్నారు. కాగా ఏఏ 23 మూవీకి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సెట్స్‌పైకి రాబోతుంది. ప్రస్తుతం రాకా షూటింగ్‌తో బన్నీ బిజీగా ఉన్నాడు బన్ని.




## కల్కి-2లో ఎంట్రీ అయిందట

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న కల్కి 2 మూవీపై మరో ఇంట్రెస్టింగ్ రూమర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ప్రభాస్‌తో పాటు కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ సహా పలువురు పాన్ ఇండియన్ యాక్టర్లు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ కూడా ఇందులో భాగం కానుందట. హైదరాబాద్‌తో పాటు చెన్నైలో వేసిన స్పెషల్ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఓ కీలక పాత్ర కోసం మేకర్స్ అలియాను తీసుకున్నట్లు సమాచారం. ఈ బ్యూటీ ఐదు రోజులు షూటింగ్‌ను కూడా పూర్తి చేసిందట. పాత్ర లెంగ్త్ తక్కువే అయినా కథను మలుపు తిప్పేలా ఈ బ్యూటీ పాత్ర ఉంటుందని అంటున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత తెలుగులో అలియా చేస్తోన్న సెకండ్ మూవీ ఇది.



## ప్రియుడితో టాలీవుడ్ హీరోయిన్ బ్రేకప్!

టాలీవుడ్‌లో మరో లవ్‌స్టోరీకి బ్రేకప్ పడింది. మనస్పర్ధల కారణంగా ప్రియుడు ఖలీద్ అల్ అమీర్ నుంచి హీరోయిన్ సునయన విడిపోయినట్లు సమాచారం. సినిమాలతో బిజీగా ఉన్న టైమ్‌లోనే దుబాయ్‌కి చెందిన యూట్యూబర్ ఖలీద్ అల్ అమీర్‌తో ప్రేమలో పడింది. ఈ ఏడాదే పెళ్లిపీటలు ఎక్కనున్నట్లు వార్తలొచ్చాయి. కానీ మనస్పర్ధల కారణంగా సునయన బ్రేకప్ చెప్పిందట. సడెన్‌గా ప్రియుడిని ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసింది. ఎంగేజ్‌మెంట్‌తో పాటు అతడితో దిగిన పాత ఫొటోలన్నింటిని డిలీట్ చేసింది. ఖలీద్ కూడా సునయనను అన్ ఫాలో చేసి ఫొటోలను తొలగించడంతో వీరు విడిపోయినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ రూమర్లపై వీరిద్దరూ రియాక్ట్ కాలేదు. కాగా కుమార్ వర్సెస్ కుమారీ మూవీతో ఫస్ట్ టైమ్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించింది సునయన. టెన్త్ క్లాస్, శ్రీవిష్ణు రాజ రాజ చోర, నాగార్జున కుబేరతో పాటు తెలుగులో చాలానే సినిమాలు చేసింది.



## మమితా సింగర్ అవతారం..

ప్రేమలు బ్యూటీ మమితా బైజు తనలోని మరో కొత్త టాలెంట్‌ను చూపించేందుకు రెడీ అయ్యింది. సింగర్‌గా అవతారం ఎత్తబోతుంది. సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీ ఆగస్ట్ 14న థియేటర్లలోకి రాబోతుంది. తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్‌గా తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ సినిమాలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ పూర్తయ్యింది. రిలీజ్‌కు రెండు నెలలు ముందుగానే మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టబోతున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ ప్రోమోను జూన్ 17న రిలీజ్ చేయబోతున్నారు. ఈ పాటను తెలుగుతో పాటు తమిళ భాషల్లో మమితా బైజు పాడినట్లు మేకర్స్ హింట్ ఇచ్చారు. ఈ మూవీతోనే మమితా బైజు సింగర్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం. ఈ మూవీలో రమ్యకృష్ణ, రవీనా టాండన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.